సాక్షి
అనకాపల్లి
గురువారం । 5 । జూన్ । 2025



గానగంధర్వుడు బాలు

మర్రిపాలెం: గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు మెలోడి క్రియేటర్స్ సంగీత సేవా సంస్థ ఘనంగా నివాళులు అర్పించింది.



ఆటవిడుపు

మురళీనగర్: స్థానిక మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు నేర్పించారు.



అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. కనులపండువగా నిర్వహించారు.

తప్పుడు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై నిరసన వెల్లువెత్తింది. మాట తప్పిన సర్కారు తీరును ఎండగట్టేందుకు నిర్వహించిన కార్యక్రమాల్లో జనం పెద్దఎత్తున పాల్గొన్నారు. జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన 'వెన్నుపోటు దినం' విజయవంతమైంది. ఈ కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపాయి. ఏడాది పాలనలో కూటమి చేసిన అన్యాయంపై గళమెత్తాయి. అన్నివర్గాల ప్రజలు భారీగా తరలివచ్చి తమ సంఘీభావం తెలిపారు.



పాయకరావుపేటలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, తదితరులు



ర్యాలీతో జనసంద్రమైన నర్సీపట్నం మెయిన్‌రోడ్డు, తగ్గేదేలే అంటూ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాన్ని చూపుతున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



వెన్నుపోటు నిరసన ర్యాలీ వీడియో కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

వెన్నుపోటుపై జనాగ్రహం

- కూటమి ప్రభుత్వ పాలనపై పెల్లుబికిన నిరసన
- భారీగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- మద్దతు తెలిపిన సాధారణ ప్రజలు
- ప్రభుత్వం హామీలను గాలికి వదిలేసిందని ధ్వజం
- ఇప్పటికైనా చంద్రబాబు కట్టుబడి ఉండాలని డిమాండ్
- జిల్లావ్యాప్తంగా ర్యాలీలకు విశేష స్పందన
- స్పీకర్ ఇలాకాలో పాల్గొన్న వేలాదిమంది ప్రజలు



చోడవరంలో అర్ధనగ్న ప్రదర్శన చేసి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న కరణం ధర్మశ్రీ

సాక్షి, అనకాపల్లి: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో మోసాలను ఎండగడుతూ..ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా అనకాపల్లి జిల్లా నిరసనలతో దద్దరిల్లింది. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన 'వెన్నుపోటు దినం' ఆందోళనకు భారీ స్పందన వచ్చింది. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఇలాకాలో ప్రభుత్వం ఏడాది పాలన, స్థానిక కూటమి నాయకత్వంపై ప్రజలు తమ అసంతృప్తిని ప్రదర్శించారు. అదేవిధంగా చోడవరంలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంటు సమన్వయకర్త కరణం ధర్మశ్రీతో పాటు పార్టీ కార్యకర్తలంతా తహసీల్దార్ కార్యాలయం వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేశారు.

➡ నర్సీపట్నం నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో సీబీఎం కాంపౌండ్ నుంచి పోలీస్‌స్టేషన్, అబీద్ సెంటర్, ఆర్డీవో కార్యాలయం వద్దకు పాదయాత్రగా ప్రదర్శన జరిపారు. ఆర్డీవో ఆఫీసులో వినతిపత్రం అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు సన్యాసిపాత్రుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి రుత్తల ఎర్రాపాత్రుడు, రాష్ట్ర యువజన విభాగం నాయకుడు చింతకాయల వరుణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు లోతల సుజాత పాల్గొన్నారు.

➡ మాడుగుల నియోజకవర్గంలో మాజీ డిప్యూటీ సీఎం, పార్టీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల సలహా సంఘం సభ్యుడు బూడి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీకి విశేష స్పందన లభించింది. నాలుగు మండలాల నుంచి వచ్చిన కార్యకర్తలు బైక్ ర్యాలీ జరిపి మాడుగుల ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దకు చేరుకున్నారు. రెండు కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించి తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. పార్టీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఈర్లె అనురాధ తదితరులు పాల్గొన్నారు. ముత్యాలనాయుడు మాట్లాడుతూ.. హామీలు అమలు చేయలేక ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం చేస్తున్నారని, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారని దుయ్యబట్టారు.





మాడుగులలో తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, భారీ బైక్ ర్యాలీ



మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు ఆధ్వర్యంలో యలమంచిలిలో ర్యాలీ



అనకాపల్లి ర్యాలీలో పాల్గొన్న నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

➡ మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు ఆధ్వర్యంలో పాయకరావుపేట పంచాయతీ కార్యాలయం జంక్షన్ నుంచి లింగాల కాలనీ మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి పాదయాత్రగా వెళ్లారు. నిరసన కార్యక్రమంలో ముఖ్యనేతలు చిక్కాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

➡ అనకాపల్లి సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో అనకాపల్లి రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయం నుంచి రైల్వేస్టేషన్, నాయుడు వీధి, రామచంద్ర థియేటర్ రహదారి, నెహ్రూచౌక్ మీదుగా సుమారు రెండు కిలోమీటర్ల మేర పాదయాత్రగా ర్యాలీ చేసుకుంటూ వెళ్లి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం అందజేశారు. ఈ ర్యాలీలో అనకాపల్లి టౌన్ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ముఖ్య నాయకులు దంతులూరి దిలీప్‌కుమార్, మలసాల కుమార్‌రాజా పాల్గొన్నారు.

➡ పార్టీ అనకాపల్లి పార్లమెంటు సమన్వయకర్త కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో చోడవరంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి కొత్తూరు జంక్షన్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు ర్యాలీ చేశారు. అక్కడ అర్ధనగ్నంగా నిరసన తెలియజేస్తూ వినతిపత్రం అందజేశారు. అక్కడ నుంచి పోలీస్ స్టేషన్ వరకు వచ్చి అక్కడ సీఐ అప్పలరాజుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ ఆందోళనలో రాష్ట్ర మైనారిటీ విభాగం అధ్యక్షుడు జాన్ వెస్లీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, జిల్లా యూత్ అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ సూర్యనారాయణ పాల్గొన్నారు.

➡ మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు ఆధ్వర్యంలో యలమంచిలి గాంధీనగరంలో గల వైఎస్సార్‌సీపీ కార్యాలయం మీదుగా ఎల్ఐసీ కూడలి మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి పాదయాత్రగా చేరుకుని.. వినతిపత్రం అందజేశారు. నిరసనలో ముఖ్యనేతలు బొద్దపు యర్రయ్యదొర, బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్త, సేనాపతిరాము, ఉద్దండం త్రినాధరావు, శ్రీనుబాబు, కిశోర్‌రాజు, దేశంశెట్టి శంకర్రావు పాల్గొన్నారు.

అడ్డుకున్న పోలీసులు

నర్సీపట్నం నియోజకవర్గంలో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి రాకుండా పోలీసులు వైఎస్సార్‌సీపీ శ్రేణులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. నియోజకవర్గంలోని మూడు మండలాల నుంచి వచ్చిన పార్టీ కార్యకర్తలు, అభిమానులను సుమారు గంటకు పైగా నిలువరించారు. మాకవరపాలెం ఎస్ఐ దామోదర్ స్పీకర్ అయ్యన్నపాత్రుడి ఒత్తిడితో ఈ పనిచేశారు. అయినా ఎక్కడా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వెనక్కు తగ్గకుండా మరో మార్గంలో నర్సీపట్నంలో నిరసన కార్యక్రమానికి హాజరయ్యారు. గొలుగొండ పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ రామారావు కొంత సేపు నిలువరించే ప్రయత్నం చేశారు. నాతవరం ఎస్ఐ మునగపూడి వద్ద అడ్డుకున్నారు.


ప్రజలు బుద్ధి చెబుతారు



కూటమి ప్రభుత్వం అలవి కాని హామీలిచ్చి అమలు చేయక పోవడంతో ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. అధికారంలోకి వచ్చి ఏడాదైనా కొన్ని వాగ్దానాల గురించి కనీసం మాట్లాడక పోవడం ఆగ్రహం తెప్పిస్తోంది. తమను కూటమి నేతలు ఇలా వెన్నుపోటు పొడవడాన్ని వారు సహించకలేకపోతున్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతారు.

–పెనుమత్స నాగేశ్వరరావు, మంగవరం, పాయకరావుపేట

జనంలో అసంతృప్తి



జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతీ హామీని కచ్చితంగా అమలు చేశారు. ప్రతీ నెలా ఏదో పథకం రూపంలో డబ్బులు అందేవి. పేద ప్రజలంతా కడుపు నిండా అన్నం తినేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా పింఛన్ సొమ్ము పెంచడం మినహా సూపర్ సిక్స్ పథకాలేవీ అమలు చేయలేదు. వెన్నుపోటు నిరసనకు వేలాదిగా జనం తరలిరావడమే అసంతృప్తికి నిదర్శనం.

– కామిరెడ్డి అప్పారావు, దివ్యాంగుడు, వెంకటరాజుపురం, దేవరాపల్లి



వేట సాగదు... పూట గడవదు.. 12లో

గర్భశోకం

- ప్రాణం తీసిన ఈత సరదా
- వరాహ నదిలో మునిగి ఇద్దరు అన్నదమ్ములు మృతి
- తల్లిదండ్రులకు తీరని వేదన



పిల్లల మృతదేహాల వద్ద విలపిస్తున్న బంధువులు



సొమ్మసిల్లిన తల్లి లక్ష్మి



దేవా (ఫైల్)



హిమవంత్ (ఫైల్)

కోటవురట్ల: మాటలకందని విషాదం.. పగవారికి సైతం రాకూడని ఉత్పాతం.. వరాహ నదిలో మునిగి ఒకే కుటుంబంలోని ఇద్దరు అన్నదమ్ములు మృతి చెందారు.. ఉన్న పిల్లలిద్దరూ కన్నుమూయడంతో తల్లిదండ్రులు అంతులేని వేదనతో కన్నీరు మున్నీరయ్యారు. మీరే లేకపోతే ఇక మాకెందుకు ఈ బతుకు అంటూ వారు విలపిస్తున్న తీరు అందరి మనసులను కలచివేసింది. ఈ హృదయ విదారక ఘటన కోటవురట్ల శివారు జానకీరాంపురంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సుర్ల దేవా (14), సుర్ల హిమవంత్ (10), అల్లు నాయుడులతోపాటు కె.వెంకటాపురానికి చెందిన పోలుపర్తి మోహన్ ఉదయం 8 గంటల సమయంలో గ్రామాన్ని ఆనుకుని ఉన్న వరాహ నదిలోకి ఈత కొట్టేందుకు దిగారు. ఒకచోట లోతు ఎక్కువగా ఉండడంతో అన్నదమ్ములైన దేవా, హిమవంత్ గోతిలో పడి మునిగిపోయారు. మిగతా ఇద్దరు పిల్లలు కేకలు వేయడంతో స్థానికులు వచ్చి వారిని బయటకు తీశారు. అప్పటికే అన్నదమ్ములిద్దరూ ఊపిరాడక మృతి చెందారు. అల్లు నాయుడు బాగానే ఉండగా పోలుపర్తి మోహన్‌ను స్థానిక సీహెచ్‌సీకి తరలించి చికిత్స చేయించారు. పిల్లలు ఈతకు వెళ్లే సమయానికి మృతుల తల్లిదండ్రులు సుర్ల రాము, సుర్ల లక్ష్మి ఉపాధి పనికి వెళ్లారు. విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న వారిని ఆపడం ఎవరి తరం కాలేదు. మృతుల్లో పెద్దవాడైన దేవా చిన్నతనం నుంచి తాతగారి ఊరు రోలుగుంట మండలం రొంగలిపాలెంలో ఉంటూ రోలుగుంటలో చదువుకుంటున్నాడు. ఇటీవల తలుపులమ్మతల్లి పండగ జరగడంతో తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. సెలవులు కావడంతో తమ్ముడు హిమవంత్, మిగతా పిల్లలతో కలిసి నదిలోకి దిగి ప్రమాదంలో చిక్కుకున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ రమేష్ సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేశారు. మృతుల తండ్రి సుర్ల రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాలకు స్థానిక సీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ఎస్ సత్యనారాయణరాజు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, సర్పంచ్ బి.అనిల్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు ఆర్ఎస్ లక్ష్మీనరసింహరాజు మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ మాట్లాడుతూ పిల్లలిద్దరినీ కోల్పోయిన నిరుపేద కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

సమీకృత హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు



మధురవాడ: మధురవాడలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ సమీకృత బాలుర వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు హెచ్‌డబ్ల్యూవో రమేష్ తెలిపారు. 2025–26 విద్యాసంవత్సరంలో 3వ తరగతి నుంచి 10 వరకు చదివే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర వర్గాలకు చెందిన బాలురు మాత్రమే అర్హులు. ఇక్కడ ఉచిత వసతితో పాటు విద్య అందిస్తారు. ఆసక్తి గల విద్యార్థులు 91548 79173లో సంప్రదించవచ్చు. ముందు వచ్చిన వారికి ప్రాధాన్యం ఉంటుంది.

కలెక్టర్ కొండకర్ల ఆవ పరిశీలన

అచ్యుతాపురం రూరల్/యలమంచిలి రూరల్: కలెక్టర్ విజయ కృష్ణన్ బుధవారం కొండకర్ల ఆవను పరిశీలించారు. ఆవ విస్తీర్ణం సర్వే చేసి సరిహద్దులు వేయాలన్నారు. ఆవలో మురుగు నీరు కలవకుండా చర్యలు చేపట్టాలన్నారు. కొండకర్ల ఆవ పరిసర ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. జెట్టీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఉన్నారు. అనంతరం కలెక్టర్ యలమంచిలిలో గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు. ఇక్కడ లారస్ ల్యాబ్స్ పరిశ్రమ యాజమాన్యం సీఎస్ఆర్ నిధులతో నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణానికి సంబంధించిన ప్రాజెక్టును ఆమె ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఎక్కడెక్కడ గదులు నిర్మించాలో అధికారులు, కళాశాల ప్రిన్సిపాల్ చూపించారు. అనంతరం శేషుకొండ ప్రాంతంలో డంపింగ్‌యార్డు స్థలాన్ని కలెక్టర్ సందర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, తహసీల్దార్ కె.వరహాలు, టీపీవో శ్రీలక్ష్మి, పలువురు అధికారులు పాల్గొన్నారు.



కొండకర్ల ఆవ విస్తీర్ణం పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

ఆర్పీఎఫ్ గస్తీకి మరో 13 బైక్‌లు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, రైల్వే భద్రతా దళం సిబ్బందికి భద్రతా చర్యల పెంపుదలలో భాగంగా పెట్రోలింగ్‌కు ఉపయోగపడే 13 బైక్‌లను సమకూర్చుకుంది. ఈ మేరకు ఈ వాహనాలను ఆర్పీఎఫ్ ఐజీ, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ ఆలోక్ బోరా, వాల్తేర్ డివిజన్, డీఆర్ఎం లలిత్‌బోరా బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. వీటి ద్వారా ప్రతీ మారుమూల ప్రాంతాల్లో గస్తీ సులభతరమవుతుందని అధికారులు తెలిపారు. వీటిని మారుమూల ప్రాంతాలైన కేకే లైన్, కేఆర్ లైన్, రాయగడ-విజయనగరం సెక్షన్లలో వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ అజయ్‌ప్రకాష్ దూబే, ఇతర అధికారులు పాల్గొన్నారు.



నూతన వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆర్పీఎఫ్ ఐజీ, వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం

బెదిరించి..రూ.25వేలు యూపీఐకి బదిలీ

దారి దోపిడీ కేసులో ఇద్దరు అరెస్ట్


విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న యలమంచిలి సీఐ ధనుంజయరావు

యలమంచిలి రూరల్ : విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న యువకుడిని బెదిరించి అతని మొబైల్ ఫోన్ యూపీఐ ద్వారా రూ.25 వేల నగదు బదిలీ చేయించుకున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్టు యలమంచిలి సీఐ ధనుంజయరావు తెలిపారు. దారి దోపిడీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై యలమంచిలి మండలం కొత్తలి గ్రామానికి చెందిన బాధితుడు ఇత్తంశెట్టి ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పలు సాంకేతిక ఆధారాలతో కేసు దర్యాప్తు చేపట్టగా 92 రోజుల తర్వాత ఇద్దరు నిందితులు యలమంచిలి మండలం పులపర్తి గ్రామానికి చెందిన తప్పెట్ల భగవాన్(25), ఎస్ రాయవరం మండలం వేమగిరికి చెందిన కొప్పన రవి(29)లను పట్టుకోగలిగామని ఆయన శుక్రవారం సాయంత్రం తన కార్యాలయంలో మీడియా సమావేశంలో వెల్లడించారు. వివరాలివి. ఈ ఏడాది మార్చి 12న అచ్యుతాపురం టీజే పరిశ్రమలో మిషన్ ఆపరేటర్‌గా పని చేస్తున్న బాధితుడు విధులు ముగించుకుని తన స్వగ్రామం యలమంచిలి మండలం కొత్తలికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా పురుషోత్తపురం గ్రామానికి సమీపంలో హైవేపై ఇద్దరు గుర్తు తెలియని యువకులు తనిఖీ సిబ్బందిలా వ్యవహరించి ద్విచక్రవాహనాన్ని ఆపి బాధితుడి వద్ద డబ్బు ఉంటే ఇచ్చేయమని బెదిరించారు. తన వద్ద డబ్బు లేదని చెప్పడంతో అతని మొబైల్ ఫోన్ లాక్కుని, యూపీఐ పిన్ చెప్పాలని అడగ్గా బాధితుడు చెప్పడానికి నిరాకరించాడు.అతడిపై చేయి చేసుకోవడం , చంపుతానని బెదిరించడంతో భయపడిన బాధితుడు ప్రసాద్ తన ఫోన్ పే యూపీఐ పిన్ నెంబరు నిందితులకు చెప్పాడు. దీనినుపయోగించి బాధితుడి బ్యాంకు అకౌంట్ నుంచి నిందితుల్లో ఒకరు తన మొబైల్‌లో ఉన్న బెట్టింగ్ యాప్ అకౌంటుకు రూ.15 వేలు, మరొకరు రెండు విడతల్లో మరో రూ.10 వేలు నగదు బదిలీ చేసుకున్నారు. నేరుగా బ్యాంకు అకౌంట్లకు కాకుండా బెట్టింగ్ యాప్‌కు నగదు బదిలీ చేసుకోవడంతో నిందితులను గుర్తించడానికి ఎక్కువ సమయం పట్టిందని సీఐ చెప్పారు. దారి దోపిడీకి పాల్పడడానికి ముందు రోజు రాత్రి నిందితులిద్దరూ మూడు చోట్ల మద్యం సేవించారని మార్చి 12వ తేదీ తెల్లవారు జామున మరొకసారి మద్యం సేవించడానికి డబ్బు లేకపోవడంతో నేరానికి పాల్పడినట్టు దర్యాప్తులో తెలిందన్నారు. నిందితులిద్దరూ అవివాహితులేనని మద్యం, బెట్టింగ్‌లకు అలవాటుపడి దారి దోపిడీకి తెగించారన్నారు. ఇలాంటి నేరాలను పోలీసు శాఖ తీవ్రంగా పరిగణిస్తుందన్నారు. కఠిన శిక్షలు ఉంటాయన్నారు. నిందితులిద్దర్నీ న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చి, రిమాండ్‌కు తరలించినట్టు సీఐ చెప్పారు. సమావేశంలో యలమంచిలి రూరల్ ఎస్ఐ ఎం.ఉపేంద్ర, ఆచారి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వేట సాగదు...పూట గడవదు..

- తాండవ జలాశయంలో రొయ్యల వేటకు ఇబ్బందులు
- అధిక వర్షాలే కారణం


వేట సరిగా జరగక ఒడ్డున ఉన్న వలలు


తాండవ జలాశయంలో రొయ్యల వేట నిర్వహిస్తున్న జాలర్లు

గొలుగొండ : వందలాది మంది జాలర్లకు అన్నం పెట్టే తాండవ జలాశయం ఈ వేసవిలో జాలర్లకు నిరాశే మిగిల్చింది. ప్రతి ఏటా వేసవి వచ్చిందంటే జాలర్లకు కాసుల పంట పండేది. కానీ ఏ ఏడాది దాదాపుగా 15 సంవత్సరాలుగా ఎన్నడూ లేని విధంగా వేసవిలో రొయ్యల వేట చాలా మందకొడిగా సాగుతోందని జాలర్లు ఆవేదన చెందుతున్నారు. ప్రతి ఏటా వేసవిలో రొయ్యల వేట జలాశయంలో ఎంతో ఉత్సాహంగా నిర్వహిస్తే ఈ ఏడాది మే నెలలో భారీ వర్షాలు కురిసి రొయ్యల వేటకు ఇబ్బందులు కలిగించాయి.

500 మందికి జీవనోపాధి...

తాండవ జలాశయంలో 500 మంది వరకు జాలర్లు ప్రతి ఏటా రొయ్యల వేట సాగిస్తుంటారు. మత్స్యకారుల సంఘం ఆధీనంలో ఈ రొయ్యల వేట నిర్వహించి జీవనోపాధి పొందుతారు. ప్రతి ఏటా ఏప్రిల్‌లో సంఘం ఆధ్వర్యంలో రొయ్యల వేట నిర్వహించి జూన్ రెండవ వారంలో వేటను నిలుపుదల చేస్తారు. సుమారుగా 50 రోజుల పాటు రొయ్యల వేట నిర్వహించే సమయంలో ప్రతి జాలరికి ప్రతిరోజు రూ.1500 వరకు ఆదాయం వస్తుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు, అలాగే రాత్రి సమయంలోనూ వేట నిర్వహించి జీవనోపాధి పొందుతారు. అయితే ఈ ఏడాది ఈ పరిస్థితి లేకుండా పోయింది.

ఎండల సమయంలో వర్షాలు

తాండవ జలాశయం సుమారుగా 4వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. తాండవ జలాశయం చుట్టూ వెంకటాపురం, పాగచెట్లపాలెం, గొలుగొండ, జోగుంపేట, సాలికమల్లవరం, అమ్మపేట, గాదంపాలెం, జలార్లుపేట, జాలర్లుపేట, కొత్తమల్లంపేట తదితర గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో లైసెన్సులు ఉన్న వారు సుమారుగా 200 మంది జాలర్లు కాగా మరో 300 వందల మంది వరకు అనుభవం ఉన్న జాలర్లు రొయ్యల వేట నిర్వహిస్తారు. ప్రతి ఏటా మత్స్యకారల సంఘం ప్రతినిధులు, మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ నెలలో రొయ్యల వేట సాగించి జూన్ రెండవ వారంలో నిలుపుదల చేస్తారు. వేడి తీవ్రత అధికంగా ఉండడం వల్ల రొయ్యలు జలాశయం నుంచి బయటకు వచ్చే సమయంలో వేట సులువుగా జరుగుతుంది. కానీ ఏ ఏడాది మే నెల అంతా భారీ వర్షాలు, తుఫాన్ల ప్రభావం వల్ల రొయ్య జలార్లకు చిక్కలేదు. రొయ్యల కోసం బిందులు, వలలు వేసుకొని జలాశయంలోకి వెళ్లి ప్రయత్నాలు చేసినా అనుకున్నంత ఫలితం దక్కలేదు. మరో 10 రోజుల్లో రొయ్యల వేట నిలుపుదల చేయడం జరుగుతుందని, కానీ ఇప్పటి వరకూ సరిగా వేట సాగ లేదని ఆవేదన చెందుతున్నారు.

ఈ ఏడాది నిరాశే...



గడిచిన 15 సంవత్సరాల చరిత్రలో ఈ ఏడాది మే నెలలో భారీ వర్షాలు కురిసాయి. దీంతో రొయ్యల వేట జరగడం చాలా కష్టతరంగా మారింది. మే నెలలో రొయ్యల వేటకు వెళ్లిన సందర్భంగా గాలులు, వర్షాల కారణంగా చాలా ఇబ్బందులు పడ్డాం. చేపల వేట కన్నా రొయ్యల వేట 50 రోజుల్లో మంచి ఆదాయం అందిస్తుంది. కానీ ఈ ఏడాది నిరాశే మిగిలింది. మరో 10 రోజుల్లో రొయ్యల వేట నిలిచిపోతుంది.

– రాజు, మత్స్యకారుడు, వెంకటాపురం


రొయ్యల వేట జరగక బిందలతో వెనుతిరుగుతున్న మత్స్యకారుడు


జలాశయంలో దొరికే స్కాంబియా రొయ్య

కొత్తకోటలో నిలిచిన సచివాలయ సేవలు


కొత్తకోట సచివాలయం

రావికమతం : కొత్తకోటలోని గ్రామ సచివాలయాల్లో ఉద్యోగుల్లేక ప్రభుత్వ పరమైన సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. 15 వేలు పై బడి జనాభా ఉన్న కొత్తకోటలో మూడు గ్రామ సచివాలయాలు ఉన్నాయి. సచివాలయం -1 లో డిజిటల్ అసిస్టెంట్ , వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఉద్యోగులు లేరు. వేసవి సెలవులు అనంతరం ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. పాఠశాలలు, కళాశాలల్లో చేరే విద్యార్థులకు కుల,ఆదాయ తదితర ధ్రువీకరణ పత్రాలు అవసరం. అలాగే రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంది. డిజిటల్ అసిస్టెంట్ ఉద్యోగులు లేకపోవడంతో ఆ సచివాలయం పరిధిలో పని జరగట్లేదు. రెండో, మూడు సచివాలయాల్లోనూ సిబ్బంది అరకొరగానే ఉన్నారు. ఒకటో సచివాలయం పరిధిలోని విద్యార్థులు, స్థానికులు స్థానికులు వివిధ ధ్రువపత్రాలు, రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేయడానికి రెండు, మూడు సచివాలయాలకు వెళ్లినా అక్కడి సిబ్బంది పట్టించుకోవడం లేదని ప్రకాష్‌రావు, వెంకటేశ్వర్లు, రమణబాబు తదితరులు చెబుతున్నారు. ఒకటో సచివాలయం పరిధిలోని వారంతా ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ఒకటో సచివాలయంలో సేవలు నిలిచిపోకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వెంకన్నబాబు తెలిపారు.

జీడితోటలో 80 కేజీల గంజాయి స్వాధీనం

ముగ్గురు అరెస్టు, రిమాండ్


గంజాయి కేసులో నిందితులతో డీఎస్పీ శ్రావణి, రోలుగుంట పోలీసులు

అనకాపల్లి : రోలుగుంట మండలం కొవ్వూరు నుంచి కంతలం గ్రామాల మధ్యలో జీడితోటలో 80 కేజీల గంజాయి నిల్వ చేసినట్టు అజ్ఞాత వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు రోలుగుంట ఎస్ఐ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించడం జరిగిందని డీఎస్పీ శ్రావణి అన్నారు. కొత్తూరు పంచాయతీ డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రావణి బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీడితోటల్లో తనిఖీలు నిర్వహించగా 60 కేజీల గంజాయి నిల్వ చేసినట్టు గుర్తించారని, మరో 20 కేజీల గంజాయిని తీసుకుని అక్కడ దాచేందుకు వచ్చిన నర్సీపట్నం పట్టణానికి చెందిన కుంచా యేసుక్రాంతి, రోలుగుంట మండలం రత్నంపేట గ్రామానికి చెందిన ఎర్ర పవన్ కుమార్‌లు పోలీసులను చూసి వెనుదిరిగి వెళుతూ పట్టుబడ్డారని తెలిపారు. వారిని విచారించగా అల్లూరి జిల్లా, చింతపల్లి మండలం శిరిపురం గ్రామానికి చెందిన బూరిటీ శ్రీను నుంచి గంజాయిని కొనుగోలు చేసి కొవ్వూరు-కంతలం గ్రామాల మధ్య జీడితోటలో భద్రపరిచినట్టు తెలిపారన్నారు. నిందితుల వద్ద మూడు సెల్‌ఫోన్లు, బజాజ్ పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ చెప్పారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు తెలిపారు. కేసులో ప్రతిభ కనబర్చిన పోలీసు సిబ్బందిని నగదు ప్రోత్సాహంతో అభినందించారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

చోడవరం అటవీశాఖ రేంజర్ జగదీష్


జెడ్పీ ఉన్నత పాఠశాలకు అందజేసిన మొక్కలతో చోడవరం రేంజర్ జగదీష్, పాఠశాల సిబ్బంది

రోలుగుంట : మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణతో పాటు సమాజానికి మేలు జరుగుతుందని అటవీశాఖ చోడవరం రేంజర్ జగదీష్ అన్నారు. రావికమతం మండలం మరుపాక నర్సరీ నుంచి పలు జాతుల మామిడి, నేరేడు, వేప,రావి తదితర 150 మొక్కలను బుధవారం ఆయన స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల సిబ్బందికి అందజేశారు. ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి మొక్కలు పెంపకం చేపడుతుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ మొక్కలు నాటాలి, పొలాల్లో, చెరువు గట్లపై రైతులు ఏఏ మొక్కలు నాటాలో తెలియజేశారు. పచ్చదనం, వన వృక్షాల అభివృద్ధితోనే ఆశించిన వర్షాలు పడతాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు గోవింద, నాయకులు బంటు రాజు, ఈ కాంప్లెక్సు సీఆర్పీ సతీష్, వివిధ గ్రామాల జెడ్పీ ఉన్నత పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, రైతులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని తాపీమేస్త్రి మృతి

కశింకోట : ఉగ్గినపాలెం వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రి మృతి చెందాడు. ఎస్ఐ కె.లక్ష్మణరావు అందించిన వివరాల ప్రకారం ఉగ్గినపాలెం కూడలి వద్ద జాతీయ రహదారి దాటుతుండగా యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వస్తున్న గుర్తు తెలియని లారీ ఢీకొంది. ఈ ఘటనలో ఉగ్గినపాలేనికి చెందిన కలగా దుర్గినాయుడు (45) మృతి చెందాడు. తాపీమేస్త్రిగా పని చేస్తూ జీవనం సాగిస్తున్న నాయుడుకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఈ మేరకు అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

బీకాం టాపర్‌కు సీపీఎం నేతల సన్మానం


దుర్గా ప్రసాద్‌ను సంస్కరిస్తున్న సిపిఎం పార్టీ నేతలు

గొలుగొండ: ఆదివాసీ గిరిజన యువకుడు దుర్గాప్రసాద్ బీకాంలో యూనివర్శిటీ ప్రథమ స్థానం సాధించడంతో సీపీఎం నేతలు బుధవారం గ్రామంలో సత్కరించారు. పాతమల్లంపేట పంచాయతీ శివారు గిరిజన గ్రామం అయిన ఎన్. గదబపాలెం గ్రామానికి చెందిన చీమల దుర్గాప్రసాద్ నర్సీపట్నంలో అల్లూరి సీతారామరాజు డిగ్రీ కళాశాలలో బీకాం చదివాడు. ఇటీవల ఫలితాల్లో ఆంధ్రయూనివర్శిటీ బీకాంలో ప్రథమ స్థానం సాధించడంతో అతనికి సీపీఎం నేతలు అభినందనలు తెలిపారు. దుర్గాప్రసాద్ గిరిజన యువకులకు ఆదర్శంగా నిలుస్తాడన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు నారాయణమూర్తి, అడిగర్ల రాజు, గొర్రి శివ, చీమల రాము, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి


ప్రసాద్ మృతదేహాన్ని బయటకు తీస్తున్న స్థానికులు

పెందుర్తి: తోటి కూలీలతో కలిసి సరదాగా ఈతకు వెళ్లిన ఓ వ్యక్తి నీట మునిగి మృతి చెందాడు. పెందుర్తి మండలం ముదపాకలో ఈ ఘటన చోటు చేసుకుంది. సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా తెర్లాంకి చెందిన పక్కి ప్రసాద్(25) ముదపాకలోని జగనన్న కాలనీలో నిర్మాణ పనులు చేసుకుంటూ అక్కడే ఉంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఇంటి పనులు చేసిన తరువాత సమీపంలోని బావిలోకి తోటి ముగ్గురు నిర్మాణ కూలీలతో కలిసి ఈతకు వెళ్లాడు. మిగిలిన వారు వెళ్లిపోదాం అంటే 'నేను కాసేపు ఉండి వస్తాను' అని చెప్పడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ప్రసాద్ తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన తోటి కూలీలు బావి వద్దకు వెళ్లారు. అక్కడ దుస్తులు ఉండడంతో ప్రసాద్ నీటిలో మునిగిపోయి ఉండవచ్చని వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ఆదేశాల మేరకు ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ప్రసాద్ మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

సకాలంలో ప్రభుత్వ సేవలందించాలి

తుమ్మపాల: అధికారులు ప్రజలకు నిర్ణీత గడువులోగా సేవలు అందించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ అర్జీలు, మ్యుటేషన్లు, రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీ, ఏపీ సేవా సర్వీసులు, నీటి తీరువా వసూళ్లు, ఇంటి స్థల దరఖాస్తులు, బాణసంచా తయారీ యూనిట్ల తనిఖీ వంటి అంశాలపై ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు అందజేసిన అర్జీలను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని, అర్జీలు పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని, తీసుకున్న చర్యల ఎండార్సుమెంటు కాపీని అర్జీదారునికి అందించాలన్నారు. దివ్యాంగులు, వృద్ధులకు వారి ఇంటి వద్దనే రేషన్ సరుకులు అందించాలన్నారు. నీటి తీరువా వసూళ్లు జూలై నాటికి పూర్తిచేయాలని, బకాయిలు సకాలంలో వసూలు చేయడం ద్వారా కౌలురైతులకు వ్యవసాయ రుణాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్వో సత్యనారాయణరావు, ఆర్డీవోలు వి.వి.రమణ, షేక్ ఆయిషా, డీఎస్‌వో కె.ఎల్.ఎస్.మూర్తి, జిల్లా సర్వే అధికారి, తహశీల్దార్లు, ఉప తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై కారు దగ్ధం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఆరిలోవ: జాతీయ రహదారిపై బుధవారం ఉదయం ప్రయాణిస్తున్న ఒక కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. అదృష్టవశాత్తు కారులో ఉన్న ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. మధురవాడ నుంచి నగరానికి వెళ్తున్న ఒక కారు జూ పార్కు సమీపంలోకి రాగానే పొగలు రావడం డ్రైవర్ గమనించాడు. వెంటనే అప్రమత్తమై కారును రోడ్డు పక్కన నిలిపివేశాడు. కారు ఆపిన వెంటనే మంటలు ఒక్కసారిగా వ్యాపించాయి. ఈ ఘటనతో వెనుక వస్తున్న ఇతర వాహనదారులు భయపడి సుమారు అర కిలోమీటరు దూరంగా తమ వాహనాలను నిలిపివేశారు. కారులో ఉన్నవారు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఆరిలోవ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే మంటలు తీవ్రంగా ఎగిసిపడుతున్నాయి. సిబ్బంది వెంటనే మంటలను అదుపులోకి తీసుకొచ్చారు, కానీ అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. కారు లోపల షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగి ఉంటాయని పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది భావిస్తున్నారు. ఈ ఘటనపై ఆరిలోవ పోలీసులు ప్రమాదవశాత్తు కారు దగ్ధమైనట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెల్త్ ఎడ్యుకేటర్స్ సర్వీసెస్ అసోసియేషన్ హర్షం

విశాఖ సిటీ: హెల్త్ ఎడ్యుకేటర్ పోస్ట్ హోదాను డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా మార్పు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడంపై హెల్త్ ఎడ్యుకేటర్స్ సర్వీసెస్, వెల్ఫేర్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వర్ డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌కు అభినందనలు తెలిపారు. తమ అభ్యర్థన మేరకు పేరు మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎం.భానుమూర్తి, రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ పేర్కొన్నారు. దీనికి సహకరించిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సిహెచ్.సుధాకరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సయ్యద్ బేగం, ట్రెజరర్ ఎన్.హరిప్రసాద్, సభ్యులు జయప్రకాశ్, అనురాధ, సుబ్బలక్ష్మి, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో తొలి సిరామిక్ మోకాలి సంయోజన శస్త్రచికిత్స

డాబాగార్డెన్స్: విశాఖలోని ఎంజీఎం సెవెన్‌హిల్స్ హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సుశాంత్‌కుమార్ మల్లిక్ నేతృత్వంలో రాష్ట్రంలో రెండు చారిత్రాత్మక ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. ఆయన బుధవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి కుడి మోకాల్లో అడ్వాన్స్‌డ్ స్టేజ్-4 పోస్ట్ ట్రమాటిక్ ఆస్టియో ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నాడు. ఎంజీఎం సెవెన్‌హిల్స్ హాస్పిటల్లో చేరగా వైద్య బృందం రాష్ట్రంలోనే తొలి సిరామిక్ మోకాలి సంయోజన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. మెటల్ ఇంప్లాంట్స్ కంటే సిరామిక్ ఇంప్లాంట్స్ ఎక్కువకాలం నిలిచి రోగులకు మెరుగైన, దీర్ఘకాల ఫలితాలు ఇస్తాయన్నారు. అలాగే రాష్ట్రంలోనే తొలి రివర్స్ షోల్డర్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు వెల్లడించారు. ఒడిశాలోని బొలంగీర్‌కు చెందిన 48 ఏళ్ల సునీల్‌కుమార్ బిశ్వాల్ రొటేటర్ కఫ్ ఆర్థోపతి, సికిల్‌సెల్ వ్యాధి కారణంగా షోల్డర్ జాయింట్‌లో తీవ్ర సమస్యలు ఏర్పడ్డాయి. దీనికి అధునాతన శస్త్రచికిత్స చేసినట్లు తెలిపారు. సమావేశంలో మెడికల్ డైరెక్టర్ డాక్టర్ అశుతోష్ చందర్ సుద్, జనరల్ మేనేజర్ సందీప్‌కుమార్ లెంక, డీజీఎంలు అశోక్ పట్నాయక్, వై.రమేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిప్పులు చెరిగిన భానుడు

కశింకోట: సూర్యుడు నిప్పులు చెరగడంతో బుధవారం మండల ప్రజలు తీవ్ర అవస్థలకు గురయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో అత్యవసర పనులున్న వారు మినహా మిగిలిన వారు ఇళ్ల నుంచి బయటకు రావడానికి సాహసించలేదు. కశింకోటలోని ప్రధాన రహదారులు లేక వెలవెలబోయాయి. సాయంత్రం మబ్బు వేసి ఎండ చల్లబడటంతో ఊపిరి పీల్చుకున్నారు.

పలు కేసుల్లో నిందితుడు అరెస్టు

అనకాపల్లి: పలు కేసుల్లో నిందితుడైన పాయకరావుపేట మండలం మంగవరం గ్రామానికి చెందిన యాండ్ర సత్తిబాబును కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 3వ తేదీన అరెస్టు చేసినట్టు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సుధీర్ చెప్పారు. కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారని తెలిపారు. దీంతో విశాఖ కేంద్ర కారాగారానికి పంపినట్టు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సుధీర్ చెప్పారు.

నేడు సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం మహాసభ

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గవరపాలెం వి.వి.రమణ రైతు భారతిలో జిల్లా సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం మహాసభ గురువారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కాండ్రేగుల అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్‌కి గుర్తింపు కార్డులు ఉచితంగా అందజేయడం జరుగుతుందని, కార్డు కావల్సిన వారు ఆధార్ కార్డు జెరాక్స్, మూడు స్టాంప్ సైజు ఫొటోలు తీసుకురావాలని చెప్పారు.

నేడు దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం దుర్గానగర్‌లో దుర్గాదేవి అమ్మ వారి విగ్రహ ప్రతిష్ట, శిఖర ప్రతిష్ట కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.ఆలయం వద్ద మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరుగుతుందని తెలిపారు.


వెంకన్న ఆలయానికి విరాళం



వెంకన్న ఆలయానికి విరాళం అందజేస్తున్న దృశ్యం

మునగపాక: స్థానిక బైపాస్ రోడ్డులో రూ. 5 కోట్ల వ్యయంతో చేపట్టిన వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. బుధవారం మునగపాకకు చెందిన టెక్కలి వెంకటప్పారావు,కుమారి దంపతులు రూ.10,116 నగదును విరాళంగా కమిటీ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల జగ్గారావు, వెలగా శ్రీనివాసరావు, పాలిమేర గణేష్,పెంటకోట ఉమేష్, బొడ్డేడ రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 129 దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,300	4,960
రెండో రకం	4,000	4,200
మూడో రకం	3,400	3,670

అనకాపల్లి సినిమాలు

భైరవం	:రాజా
ఖలేజా	:సత్యనారాయణస్క్రీన్-1
కరాటే కిడ్-లిజండ్స్	: సత్యనారాయణ స్క్రీన్-2
ఖలేజా	:పరిసాయి
సింగల్	:షిర్డీసాయి
ఏసీఈ	:వెంకటేశ్వర
శుభం	:శ్రీసత్య
షష్టిపూర్తి	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 80 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-24 యూనిట్లు, బి పాజిటివ్-12 యూనిట్లు, ఒ పాజిటివ్-36 యూనిట్లు, ఏబీ పాజిటివ్-8 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యూ.లోకేష్‌ను (ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 389 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 326 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (ఫోన్ నంబర్ 08924-223595)ని సంప్రదించవచ్చు.

రాష్ట్ర ప్రజలకు 'కూటమి' వెన్నుపోటు

- నమ్మి ఓటేసిన ప్రజలను మోసం చేశారు
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్
- అనకాపల్లిలో భారీ స్థాయిలో 'వెన్నుపోటు దినం' నిరసన
- వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు



తహసీల్దార్ కార్యాలయం వద్ద గేటువేసి పార్టీ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు

అనకాపల్లి: నమ్మి ఓటేసిన రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. కూటమి నాయకుల చేతుల్లో ప్రజలుఘోరంగా మోసపోయారని చెప్పారు . కూటమి ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా వైఎస్సార్ సీపీ చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమం భరత్‌కుమార్ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో జరిగింది. నియోజకవర్గం నలుమూలల నుంచి వేలాదిగా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయం నుంచి నిర్వహించిన భారీ నిరసన ర్యాలీ రైల్వే స్టేషన్, భీము నిగుమ్మం, నాయుళ్లవీధి, రామచంద్రథియేటర్ రహదారి, నెహ్రూచౌక్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకూ సాగింది. అక్కడ డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీరామ్మూర్తికి మలసాల భరత్‌కుమార్, పార్టీశ్రేణులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ సూపర్ సిక్స్‌తో సహా ఎన్నికల ముందు 143 హామీలు ఇచ్చి ఒక్కటి కూడా సక్రమంగా అమలు చేయకుండా సీఎం చంద్రబాబు నాయుడు అన్ని వర్గాల ప్రజలకు వెన్నుపోటు పొడిచారని తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు దారుణంగా క్షీణించాయని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి ఏదీ లేకపోగా అవినీతి పెచ్చుమీరిందన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ ఇష్టం వచ్చినట్లు తప్పుడు కేసులు పెట్టడమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. ఏడాదిలోనే ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందన్నారు. ఇచ్చిన హామీలను విస్మరించిన ప్రభుత్వానికి ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారని తెలిపారు. వెన్నుపోటు దినం సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహిస్తామని పోలీసులకు లిఖితపూర్వకంగా తెలియచేస్తే పర్మిషన్ ఇవ్వలేదన్నారు. అయినా ప్రజలు, పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా తరలివచ్చి ర్యాలీలో భారీ ఎత్తున పాల్గొన్నారని చెప్పారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలు, దళితులకు రక్షణ లేకుండా పోయిందని తెలిపారు. చంద్రబాబు.. పిల్లనిచ్చిన మామను వెన్నుపోటు పొడిచినట్టుగానే నమ్మి గెలిపించిన బడుగు, బలహీన వర్గాల ప్రజలను కూడా వెన్నుపోటు పొడిచారన్నారు. పేదల నుంచి ప్రభుత్వ ఉద్యోగుల వరకు అన్ని వర్గాల ప్రజలను కూటమి ప్రభుత్వం వంచించిందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఐదు సంవత్సరాల్లో చేసిన అప్పు కూటమి పాలనలో ఒక ఏడాదిలో చేశారని, రాష్ట్రాన్ని మరో శ్రీలంకగా మార్చేందుకు చంద్రబాబు నాయుడు శక్తివంచనలేకుండా కృషి చేస్తున్నారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బలహీన వర్గాల ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని చెప్పారు. కరోనా వంటి విపత్కర సమయంలో రాష్ట్రానికి ఆదాయం లేకపోయినప్పటికీ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు వై.ఎస్. జగన్ సంక్షేమ పథకాలు అమలు చేయడం ఆపలేదన్నారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్రయువజన విభాగం కార్యదర్శి మలసాల కుమార్‌రాజా, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, 83వ వార్డు ఇన్‌చార్జ్ జాజుల రమేష్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా మాజీ రాష్ట్ర చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, జిల్లా పరిషత్ కో ఆప్షన్‌సభ్యుడు పెతకంశెట్టి శివసత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి, కశింకోట మండల అధ్యక్షులు పెదిశెట్టి గోవింద్, మలసాల కిషోర్, మండలపార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు కె.పద్మకుమారి, గవర కార్పొరేషన్ మాజీ రాష్ట్ర డైరెక్టర్ బొడ్డేడ శివ, 80 వార్డు ఇన్‌చార్జ్ కె.ఎం.నాయుడు, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, పార్టీ సీనియర్ నాయకులు కరక సోమునాయుడు, పి.డి. గాంధీ, దాడి నారాయణ రావు, బొడ్డేడ లక్ష్మీనరసింహం, కుండల రామకృష్ణ, గైపూర్‌రాజు, మరిపల్లి శోభ, లక్ష్మి, కొణతాల మురళీకృష్ణ, కాండ్రేగుల హైమవతి, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

భారీగా తరలివెళ్లిన నాయకులు

కశింకోట: నియోజకవర్గ కేంద్రం అనకాపల్లిలో నిర్వహించిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి కశింకోట మండలం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. మండలంలో పలు గ్రామాల నుంచి బైక్‌లు, కార్లు, ఆటోలు తదితర వాహనాల్లో పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు.



వెన్నుపోటు దినం నిరసన ర్యాలీలో పాల్గొన్న ప్రజలు, అభిమానులు



తహసీల్దార్ కార్యాలయంలో డీటీ శ్రీరామ్మూర్తికి వినతిపత్రం అందజేస్తున్న మలసాల భరత్‌కుమార్, పార్టీ శ్రేణులు

మలేరియా నివారణకు కృషి చేయాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ వాణి జగదీశ్వరి

అనకాపల్లి టౌన్: మలేరియా నివారణకు అందరూ కృషి చేయాలని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారి వాణి జగదీశ్వరి తెలిపారు. దోమలతో వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, అందువల్ల వాటి నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని మార్టూరు విలేజ్ హెల్త్ క్లినిక్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి తొట్టెలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, ప్రతి ఒక్కరూ రాత్రివేళల్లో నిద్రించేటప్పుడు దోమ తెరలను వినియోగించాలని తెలిపారు. మలేరియా రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ముద్రించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెచ్‌ఈవో బి.మంగమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ, ఎఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అలరించిన పాటల పోటీలు

యలమంచిలి రూరల్: ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతిని పురస్కరించుకుని యలమంచిలి గుర్రప్ప కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పాటల పోటీలు అలరించాయి. మొదటి బహుమతి అనకాపల్లికి చెందిన ఆర్ సన్యాసిరావు, రెండో బహుమతి హైదరాబాద్‌కు చెందిన కె. దుర్గాప్రసాద్, మూడో బహుమతి ఎ. రాజు, యలమంచిలికి చెందిన సి.డి.వి. తేజస్వి ప్రోత్సాహక బహుమతి పొందారని నిర్వాహకుడు మత్తుర్తి రామారావు తెలిపారు.

కౌలు రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



డీటీ శేషుబాబుకు వినతి పత్రం అందజేస్తున్న బ్రహ్మాజీ

మునగపాక: కౌలు రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని సీఐటీయూ నేత ఎస్.బ్రహ్మాజీ కోరారు. కౌలు రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఆయన బుధవారం డీటీ శేషుబాబుకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడంలో కూటమి ప్రభు త్వం విఫలమైందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించారని చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకంలో కౌలు రైతులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.వినతి అందజేసిన వారిలో వేగి శివ, వేగి సూరప్పారావు, పి.అప్పలనాయుడు తదితరులున్నారు.

యాంత్రీకరణతో ఖర్చు ఆదా



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

నక్కపల్లి: సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడంతోపాటు, యాంత్రీకరణ పద్ధతులను అవలంబించడం ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్తలు సూచించారు. వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఉద్దండపురం, నెల్లిపూడి, వేంపాడు గ్రామాల్లో బుధవారం రైతులతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. బీసీటీ కృషి విజ్ఞాన్ కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజమండ్రి వాణిజ్య పంటల పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.ప్రభాకర్‌రావు మాట్లాడుతూ రైతులు సంయుక్తంగా వ్యవసాయం చేసి, ఒకే యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా అన్ని రకాల సమస్యలను చీడపీడలను నియంత్రించవచ్చని తెలిపారు. రైతు ఉత్పత్తిదారులు సంస్థగా ఏర్పడటం ద్వారా కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు సహాయం కూడా పొందవచ్చని చెప్పారు. కొబ్బరి వంటి దీర్ఘకాలిక తోటలలో విత్తన ఎంపిక చాలా కీలమన్నారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సంరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఎద వరి సాగు చేయడం ద్వారా ఖర్చులు గణనీయంగా తగ్గించవచ్చన్నారు. ఉద్యాన వన శాస్త్రవేత్త ఎం.శివ మాట్లాడుతూ కొబ్బరిలో తట్టుకాలయ నియంత్రణ , కొమ్ముపురుగు, ఎర్రముక్కపురుగు, బంక తెగులు, తెల్లదోమల యాజమాన్యపద్ధతుల గురించి వివరించారు. జీవన ఎరువులు ట్రైకోడెర్మా చివరి దమ్ములో చల్లుకోవడం ద్వారా తెగులు రాకుండా పంటలను కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు బండెడు కష్టాలు

- సుదూరంగా డిపోలు
- అస్తవ్యస్తంగా జాబితాలు
- పనిచేయని సర్వర్లు...గంటల తరబడి పడిగాపులు
- రేషన్ పొందేందుకు అవస్థలు పడుతున్న కశింకోట వాసులు



అమరపల్లి వీధి రేషన్ డిపోలో వేలి ముద్ర వేస్తున్న వృద్ధుడు



కోటా సరుకుల పంపిణీ విధానం మార్పుతో నిరుపయోగంగా ఉన్న వాహనాలు



అమరపల్లి వీధి డిపో నుంచి బియ్యం తీసుకెళుతున్న మహిళ



డిపో ఎదుట నిరీక్షిస్తున్న మహిళలు

కశింకోట: ఎండీయూ వాహనాల రద్దుతో కశింకోట పంచాయతీవాసులకు రేషన్ కష్టాలు ప్రారంభమయ్యాయి. సుదూరంలో రేషన్ డిపోలుండడం, ఒక డిపో పరిధిలో కార్డుదారుల పేర్లను మరో డిపో జాబితాలో చేర్చడం, సర్వర్లు సరిగా పనిచేయకపోవడంతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. నాలుగు ఎండీయూ వాహనాల ద్వారా ఇటీవల వరకు ఇంటి వద్దకే రేషన్ అందించే వారు. మేజర్ పంచాయతీ కశింకోటలో తొమ్మిది రేషన్ డిపోలున్నా ఇప్పుడు కోటా బియ్యం, సరుకులు పొందడం కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రేషన్ డిపోలు దాదాపుగా అన్ని ఒకేచోట ఉండటం, ఇతర ప్రాంతాలకు విస్తరించి లేకపోవడంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. కిలో మీటరుకు పైగా నడిచి డిపోలకు వెళ్లి రేషన్ తెచ్చుకోవలసి వస్తోందని పంచాయతీ ప్రజలు వాపోతున్నారు. అస్తవ్యస్తంగా పేర్లు నమోదు చేసి, జాబితా రూపొందించడం వల్ల చెంతనే ఉన్న డిపోలో కాకుండా దూరంగా ఉన్న డిపోల్లో సరుకులు పొందవలసి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పంచాయతీలో సుమారు ఐదు వేల మందికి బియ్యం కార్డులున్నాయి. వీరికి గత వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో పీడీఎస్ వాహనాల ద్వారా ఇంటి వద్దే బియ్యం, ఇతర సరుకులను అందించే వారు. ఇందుకు కశింకోటతోపాటు వెదురుపర్తి గ్రామానికి నాలుగు వాహనాలను కేటాయించారు. ఒక్కో వాహనం ద్వారా రోజుకో వీధిలో సరుకులు అందజేసేవారు. ఎంతో సౌకర్యంగా ఉన్న ఆ విధానం గత మే నెల వరకు సాగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాహనాలను రద్దు చేసి గతంలో ఉన్న 9 చౌక డిపోల ద్వారా రేషన్ సరుకులను ఈ నెల 1 నుంచి పంపిణీ చేయడం ప్రారంభించారు. దీంతో ప్రజలకు కష్టాలు ప్రారంభమయ్యాయి. సర్వర్లు సరిగ్గా పని చేయకపోవడంతో ఎక్కువ సమయం నిరీక్షించాల్సి రావడంతో పాటు రెండుమూడు సార్లు డిపోలకు వెళ్లవలసి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఒక్కటి మినహా మిగిలిన రేషన్ డిపోలన్నీ దాదాపు ఒకే ప్రాంతంలో ఉన్నాయి. దీంతో గవరపేట, హౌసింగ్ కాలనీ, సత్తెమ్మ కాలనీ, ఇందిరా కాలనీ, అగ్రహారం, అఫీషియల్ కాలనీ, గాడి వీధి తదితర ప్రాంతాల ప్రజలు ఎక్కువ దూరం నడిచి వెళ్లి రేషన్ తెచ్చుకోవలసి వస్తోంది. గవరపేటలో ఒక డిపో ఉన్నప్పటికీ ఆ ప్రాంతానికి చెందిన ఎక్కువ మంది పేర్లు కిలో మీటరు పైగా దూరంలో ఉన్న అమరపల్లి వీధి ప్రాంతం డిపోలో ఉండడంతో అక్కడికి వెళ్లి రేషన్ తెచ్చుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. హౌసింగ్ కాలనీ, ఇందిరా కాలనీ ప్రాంతాల్లో చేరువగా చౌక డిపోలు లేకపోవడంతో సంత బయల ప్రాంతంలో ఉన్న డిపోకు జాతీయ రహదారిని దాటి సుమారు 300 మంది కార్డుదారులు రావలసి వస్తోంది. రేషన్ వాహనాలను పునరుద్ధరించే అవకాశం లేనందున కనీసం ప్రస్తుత రేషన్ డిపోల్లో కొన్నింటిని మార్పు చేసి తమ ప్రాంతాల్లో చేరువలో ఏర్పాటు చేయాలని, ప్రధానంగా హౌసింగ్ కాలనీ,ఇందిరా కాలనీ, గవరపేట, కస్పావీధి ప్రాంతాల్లో ఏర్పాటు చేసి కోటా సరుకుల పంపిణీకి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే రేషన్ డిపోల్లో అస్తవ్యస్తంగా నమోదు చేసిన రేషన్ కార్డు దారుల పేర్లను తమ నివాస సమీప ప్రాంతాల్లోని డిపోల్లో చేర్చి సరుకులు ఇవ్వాలని కోరుతున్నారు. ప్రభుత్వం, అధికారులు ఏ డిపోలోనైనా కార్డు దారులకు సరుకులు ఇస్తారని, కేటాయించిన డిపోకే వెళ్లాల్సిన పని లేదని చెబుతున్నా ఆ ఆదేశాలు ఇక్కడ అమలు కావడం లేదు. కేవలం స్టేట్ బ్యాంకు వద్ద ఉన్న ఒక్క డిపోలో మాత్రమే ఆ వెసులుబాటు ఉందని, మిగిలిన చోట లేదని డీలర్లు అంటున్నారు. తమ డిపోకు కేటాయించిన కార్డుదారులకు కాకుండా ఇతరులకు కూడా ఇస్తే సరుకులు మిగలక ఇబ్బంది పడాల్సి వస్తుందని, అందుకే ఇతర డిపోల వారికి ఇవ్వడం లేదని పలువురు డీలర్లు చెబుతున్నారు. ఒక డిపోలో 1250 వరకు కార్డుదారులుండగా, మరో డిపోలో 290 మంది వరకు మాత్రమే కార్డుదారులున్నారు. ఎక్కువ కార్డులున్న డిపోలో రద్దీ వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ఎక్కువ సమయం నిరీక్షించాల్సి వస్తోందని కార్డు దారులు వాపోతున్నారు.



అమరపల్లి వీధి డిపో ముందు రేషన్ కార్డుదారుల నిరీక్షణ

నాలుగు రోజుల పాటు తిరిగాను



మా ప్రాంతంలో రేషన్ డిపో ఉంది.అక్కడకు వెళితే మా పేర్లు అక్కడ లేవనడంతో నాలుగు రోజుల పాటు తిరిగాం. చివరకు మాపేర్లు సుదూరంగా అమరపల్లి వీధిలో గల డిపోలో ఉన్నట్టు తెలుసుకుని అక్కడికి వెళ్లి ఎక్కువ సమయం నిరీక్షించి రేషన్ పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏ డిపోలో అయినా రేషన్ ఇస్తారని అధికారులు చెబుతున్నా... ఇక్కడ అమలు కావడం లేదు. దీని దృష్ట్యా గవరపేటలో అనువైన మరో డిపోకు మా పేర్లు మార్చి రేషన్ సరుకులు అందివ్వడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

–పెంటకోట రామలక్ష్మి, గవరపేట, కశింకోట.

జాతీయ రహదారి దాటి వెళ్లాలి



రైల్వే స్టేషన్ అవతల ఉన్న సత్తెమ్మ కాలనీ నుంచి జాతీయ రహదారిని దాటి చౌక డిపోకు నడిచి వచ్చి రేషన్ సరుకులు తీసుకోవలసి వస్తోంది. గతంలో ఎండీయూ వాహనంలో మా కాలనీలో ఇళ్ల వద్దే సరుకులు అందించే వారు. ఇది ఎంతో సౌకర్యంగా ఉండేది. ఆ వాహనాలను పునరుద్ధరించాలి. లేదంటే మా ప్రాంతానికి చేరువలో రేషన్ డిపో ఏర్పాటు చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

–తాటిపాముల దుర్గారావు, సత్తెమ్మ కాలనీ, కశింకోట.

డిపో దూరంగా ఉంది



శివారులో ఉన్న నూకాంబిక ఆలయం నుంచి గ్రామంలోకి నడిచి వచ్చి రేషన్ తీసుకోవలసి వస్తోంది. డిపో దూరంగా ఉండడంతో ఇబ్బంది పడుతున్నాం. హౌసింగ్ కాలనీ ప్రాంతానికి ఒక రేషన్ డిపోను మార్పు చేయాలి.

–కృష్ణ, నూకాంబిక ఆలయ ప్రాంతం, కశింకోట.

పచ్చిరొట్ట ఎరువులతో నేలకు సారం



మూలపేటలో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మునగపాక: ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్ జ్యోత్స్నకుమారి సూచించారు. మండలంలోని మూలపేటలో బుధవారం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం,అనకాపల్లి జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త నిర్వహణలో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులను వేయడం ద్వారా భూమి గుల్లబడి పంటల సాగుకు మేలు జరుగుతుందన్నారు. తద్వారా ఆశించిన దిగుబడులు సాధించవచ్చన్నారు.విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీ హరిరావు మాట్లాడుతూ మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. భూసార పరీక్షలకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలన్నారు. పశువైద్య శాస్త్రవేత్త డాక్టర్ విజయరాజి మాట్లాడుతూ పశుగ్రాస సాగులో యూరియా వినియోగం తగ్గించాలన్నారు. వీఏఏ భవాని,వీహెచ్ఏ తులసీ తదితరులు పాల్గొన్నారు.

వాడ్రాపల్లిలో ఉచిత వైద్య శిబిరం



మందులు అందజేస్తున్న వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజు

మునగపాక: వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. మండలంలోని వాడ్రాపల్లిలో బుధవారం మునగపాక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆయన రోగులకు మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. క్రమం తప్పకుండా బీపీ,మధుమేహం పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సీహెచ్‌వో దేవకాంత, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.